క్లుప్తంగా

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల అందజేత



ట్యాబ్‌లు అందజేస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

రామచంద్రపురం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బందికి మంజూరైన ట్యాబ్‌లను చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కేవీఆర్ ఆర్ రాజు శుక్రవారం స్థానిక పురపాలక సంఘం చైర్‌పర్సన్ చాంబర్‌లో అందజేశారు. మొత్తం 35 మంది రీసోర్స్‌పర్సన్లకు ట్యాబ్‌లను డీజీ లక్ష్మి, బయోమెట్రిక్ డివైజ్‌లను అందించారు.

పీహెచ్‌సీల్లో దంత వైద్యులను నియమించాలి

కాజులూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్యులను నియమించాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, ప్రజల్లో ఇటీవల కాలంలో దంత సమస్యలు అధికమయ్యాయని, పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. మండలంలోని గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీల్లో ఏదో ఓ చోటైనా దంత వైద్యులను నియమించాలని కోరారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



మండపేటలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ మండపేట మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట 28వ రోజు ఆందోళనలో భాగంగా నినాదాలు చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ప్రతి ప్రయోజనాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కలువపువ్వు సెంటర్, మార్కెట్ రోడ్డు మీదుగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కప్పల అన్నవరం, పిట్టా ప్రవీణ్ కుమార్, సైనం భాస్కరరావు, మందపాటి గన్నియ్య, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న, వాసంశెట్టి బాలరాజు, టేకి వెంకన్న, కప్పల సురేంద్ర పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

కపిలేశ్వరపురం (కపిలేశ్వరపురం): మండపేటలోని పెద్దమ్మ ఆలయం వద్ద శుక్రవారం దాత అప్పాడ శ్రీను, రాజు, కిశోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. వారిని ఆలయ వ్యవస్థాపకుడు వాలి వీరబాబు అభినందించారు. కమిటీ సభ్యులు మండిపూడి చంద్రశేఖర్, అడ్డాల సత్తిబాబు, చల్లా శివరాం పాల్గొన్నారు.

తూడు తొలగింపు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, టేకి గ్రామాల పరిధిలోని టేకి ముురుగు డ్రెయిన్‌లో తూడు తొలగింపు పనులను శుక్రవారం ప్రారంభించారు. టేకిలో పనులను కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మేకా శివప్రసాద్ ప్రారంభించారు. డ్రెయినేజీ డీఈ పోచారావు, ఆలమూరు, రామచంద్రపురం డీసీల చైర్మన్లు మెల్ల గోపాలం, నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, అంగర నీటి సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

బీజేపీతో సుస్థిర పాలన

రాయవరం: భారతీయ జనతాపార్టీతో దేశంలో సుస్థిర పాలన సాధ్యమైందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రాయవరంలో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ 11 సంవత్సరాల పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ సాధించిన విజయాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు నిమ్మకాయల సాయిరామ్‌ప్రసాద్, అంగర జనార్దనస్వామి, కరుటూరి శ్రీనివాస్, శాకా ధనుంజయఅబ్బిరెడ్డి, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీయూ 1318 రకం వరి సాగును ప్రోత్సహించాలి

రాయవరం: స్వర్ణ రకం వరి రకానికి బదులుగా ఎంటీయూ 1318 రకం వరి సాగును ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కె.బాబూరావు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి, వ్యవసాయ విస్తరణాధికారి ఎ.శివశంకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ముంచేసిన మూడో పంట

- అక్కరకు రాని అపరాల సాగు
- మొక్కలు చనిపోతున్నాయని రైతుల ఆందోళన
- పొలాల్లో నీరు చేరడమే కారణం



చేదువాడలో మినుము సాగు చేసిన పొలంలో చేరిన నీరు

కాజులూరు: ఎంతో కొంత ఆదాయాన్ని పొందాలన్న ఉద్దేశంతో సాగు చేసిన అపరాల పంట రైతులకు నష్టాలను మూటకడుతున్నాయి. పంట పూత, పిందె దశలో ఉండగా చెదురుమదురుగా వర్షాలు కురవడం, మరోవైపు కాలువల నుంచి నీరు చేరుతుండటంతో.. పొలాల్లో నీరు నిలిచి, ఊట పెరిగి మొక్కలు చనిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఒకప్పుడు రామచంద్రపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో మూడో పంటగా రైతులు పెసర, మినుము వంటి అపరాలను విస్తారంగా పండించేవారు. కాలక్రమేణా సాగుబడిలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అపరాల సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వచ్చింది. ఆశ చావక కొందరు రైతులు అపరాలు సాగు చేసినప్పటికీ, పూత, పిందె సమయానికి వర్షాలు, కాలువ నీరు చేరి.. మొక్క కుళ్లిపోయి చనిపోతుండడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

20 శాతం సాగు

నియోజకవర్గంలో 52 వేల ఎకరాల సాగుభూమి ఉంది. అందులో ఈ ఏడాది 20 శాతం పొలాల్లో రైతులు అపరాల సాగు చేపట్టారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెం, బందనపూడి, తణుకువాడ, శీల, మంజేరు, కాజులూరు, అయితపూడి, కుయ్యేరు, కోలంక, పల్లిపాలెం తదితర గ్రామాల్లో, కె.గంగవరం మండలంలోని పేకేరు, దంగేరు, శివల, మసకపల్లి, కుందూరు, సత్యవాడ, కోటిపల్లి, కోట తదితర గ్రామాల్లో, రామచంద్రపురం మండలంలోని ఉండూరు, హసన్‌బాద, కందులపాలెం, కాపవరం, వెల్ల, తాళ్లపొలం, ఉట్రుమిల్లి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా అపరాల సాగు చేపట్టారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ప్రస్తుతం అపరాల పంట వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ కుళ్లిపోతోంది.

ఆలస్యమే.. అవరోధం

డెల్టా ప్రాంతంలో కొన్నాళ్లుగా ఖరీఫ్, రబీ సాగులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో జూన్, జూలై నెలల్లో తొలకరి సాగు, నవంబర్, డిసెంబర్ నెలల్లో దాళ్వా సాగు ప్రారంభమయ్యేది. మార్చి నెలాఖరుకు రెండో పంట పూర్తి స్థాయిలో చేతికొచ్చేది. ఆ సమయంలోనే అపరాలకు అసలైన పదును కుదురుతుంది. కొంతకాలంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కాలువల నీరు సరిగా అందకపోవడంతో పంట కాలం ఆలస్యమవుతూ వస్తోంది. ఈ ఏడాది మే నెల గడిచినా దాళ్వా మాసూళ్లు పూర్తి కాలేదు. దీంతో అపరాలను సాగు చేసేందుకు వీల్లేకుండా పోయింది. గతంలో అపరాల ఆదాయాన్ని వదులుకోలేని కొందరు రైతులు ఆలస్యమైనా.. అపరాల సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం వర్షాలు వచ్చే సమయానికి పంట పూత, పిందె దశకు చేరుకుంది. ఆరుతడి పంటయిన అపరాల సాగుకు పొడినేల అవసరం. పొలంలో నీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతే మొక్క చనిపోతుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో అపరాల సాగు చేపట్టి ఉంటే.. ఈపాటికి పంట కోత దశకు వచ్చేదని, దాళ్వా మాసూళ్లు ఆలస్యం కావడం, అపరాలు ఆలస్యంగా చల్లడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు చెబుతున్నారు. కష్టపడి పండించిన పంట కాపు కాసే సమయానికి నాశనమైందని, దీంతో మొక్కలను పొలంలో కలియదున్నాల్సి వస్తుందని రైతులు వాపోయారు. వ్యవసాయ శాఖాధికారులు స్పందించి రైతులంతా సకాలంలో వరి సాగు చేపట్టేలా చైతన్యం తీసుకురావాలని, అప్పుడే అపరాల సాగుకు అవకాశం ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



బయట మార్కెట్లో అపరాల ధర ఆకాశాన్నంటుతుంది. కనీసం ఇంటి అవసరాలకైనా నాలుగు గింజలు పండిద్దామని ఆశ చావక పెసర, మినుము సాగు చేస్తుంటే, పూత, పిందె సమయం వరకూ పెరిగి, చివరికి చేతికందకుండా తీవ్రంగా నష్టపోతున్నాం. రైతులు వరి సాగు సకాలంలో పూర్తి చేసి, అపరాల సాగుకు అవకాశం కల్పించుకోవాలి.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

రైతుల్లో చైతన్యం తేవాలి



వరి సాగు కాలమానంలో జరుగుతున్న ఆలస్యం కారణంగానే అపరాల పంటకు అవరోధాలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖాధికారులు కల్పించుకుని వరి సాగు సకాలంలో చేపట్టేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలి.

– కేశన వీర్రాజు(బాబు), రైతు, అంద్రంగి



ఐస్ స్టిక్‌పై సూర్య నమస్కారాలు, సూరంపూడి సూర్యకళ



• నేరేడు ఆకు, ఐస్ స్టిక్‌లపై సూర్య నమస్కారాలు





నేరేడు ఆకుపై రూపొందించిన సూర్య నమస్కారాలు, డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్

రామచంద్రపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ నేరేడు ఆకుపై సూర్య నమస్కారాల చిత్రాలు రూపొందించారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని సూరంపూడి సూర్యకళ ఐస్ స్టిక్‌పై సూర్య నమస్కారాలు చిత్రించింది. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పలపాటి మాచిరాజు, విద్యా కమిటీ చైర్మన్ పి.కృష్ణకుమారి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

యోగాసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు



యోగా అక్షరాకృతిలో కపిలేశ్వరపురం మండలం మాచర విద్యార్థులు

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగా అనే పదాన్ని ప్రతిబింబించే ఆంగ్ల అక్షరాల రూపంలో యోగాసనాలు వేస్తూ ప్రతిభను చాటారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఖండవిల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

కె.గంగవరం: దంగేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై వెళ్తున్న నేదునూరి రాజుకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు శుక్రవారం సన్మానం చేశారు. ఆలమూరు మండలం నర్సిపూడికి ఆయన బదిలీపై వెళ్తున్న తరుణంలో.. మాజీ సర్పంచ్ రావిపాటి గణేష్ పాఠశాల విద్యా కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందించారు.

నేడు హోమియో వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: మండల పరిధి అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. డాక్టర్ నిమ్మల రామారావు, నేమాని శ్రీనివాస్ పర్యవేక్షణలో శ్రీవిశ్వ మానవతా హోమియో వైద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో కీళ్లనొప్పులు డయాబెటిస్, స్త్రీల సమస్యలపై వైద్య పరీక్షలు చేసి, చికిత్సపై సూచనలు సలహాలు ఇస్తారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హోమియో మందులను ఉచితంగా అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

కూటమి నేతల కనుసన్నల్లో పని చేస్తానంటే సహించం

- అధికారుల తీరుపై మండిపడ్డ ఎమ్మెల్సీ తోట
- ప్రజాప్రతినిధులను విస్మరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- వాడీవేడిగా కపిలేశ్వరపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



శ్రీరామపురం ఇసుక ర్యాంపు అక్రమాలపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో కూటమి నేతల అప్రజాస్వామిక చర్యలు, ప్రభుత్వ సంక్షేమ హామీలు విస్మరణ తదితర అంశాలపై సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి నేతల కనుసన్నల్లో పనిచేస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అజెండాను చదివి వినిపించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ హాజరైన సమావేశంలో అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులు, నేలటూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు చల్లా వీర్రాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల వారీగా సమస్యలపై చర్చించారు. ప్రోటోకాల్ వ్యవహారంలో అధికారుల తీరుపై ఎమ్మెల్సీ తోట అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నెలలు తరబడి తమకు గౌరవ వేతనం చెల్లించడంలేదంటూ ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను అవమానించడం సరికాదని పరిషత్ విప్ పలివెల మధు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రజాస్వామికంగా పాలన

సభ్యుల అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పిన తీరుపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార కూటమి నేతలు చెప్పింది మాత్రమే చేస్తానంటే సహించేది లేదని అధికారులనుద్దేశించి అన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవస్థలను సర్వనాశనం చేస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తున్నారన్నారు.

బిల్లు చెల్లించడానికి ఎవరి కాళ్లు పట్టుకోవాలి..

తాతపూడిలో వంతెన నిర్మాణానికి సంబంధించి పంచాయతీ నుంచి రూ.లక్ష ఇవ్వడానికి నెలలు తరబడి వేధించడం సరికాదని ఎమ్మెల్సీ తోట అధికారులపై విరుచుకుపడ్డారు. మూడు సమావేశాలుగా ఇదే విషయం చర్చ జరిగిందని అన్నారు. ఎవరి కాళ్లు పట్టుకుంటే బిల్లు ఇస్తారో చెప్పండంటూ కూటమి నేతల ప్రమేయాన్ని ఆయన ప్రస్తావించారు. టేకిలో పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసినా కార్యదర్శి సాంకేతిక సమస్యను సాకుగా చూపి అడ్డుకుంటున్నారని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ఆవేదన వ్యక్తం చేశారు.

పెట్టుబడి సాయం లేదు.. ధాన్యం సొమ్ము చెల్లించరు

ఏడాది కాలం పూర్తయినా అన్నదాతా సుఖీభవ పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదని, పైగా మే 10 నుంచి ధాన్యం సొమ్ము చెల్లించడంలేదని ఎమ్మెల్సీ తోట ఆరోపించారు. రైతులకు జింక్ సరఫరా చేస్తామంటూ అసెంబ్లీలో మంత్రి చెప్పారని, దమ్ము పనులు కొనసాగుతున్నా జింక్‌ను సరఫరా చేయలేదని ఆయన అన్నారు.

పాఠశాల విలీనంతో ఇబ్బందులు

టేకిలోని పాఠశాలను గ్రామంలోని మరో పాఠశాలలో విలీనం చేయడంతో చిన్నారుల ప్రయాణానికి ప్రయాసలు పడుతున్నారని తల్లులు సమావేశం వద్ద ఏకరువు పెట్టారు. కేదారిలంకలోని పాఠశాలను కొత్తపేట పాఠశాలలో విలీనం చేయడంపై ఎంపీటీసీ నాగేశ్వరరావు నిరసన వ్యక్తం చేశారు. ఆయా పరిస్థితుల్లో చిన్నారులను రహదారులపై నడిపించడం ప్రమాదకరమని ఎమ్మెల్సీ తోట అన్నారు.

శ్రీరామపురం ర్యాంపు నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు

శ్రీరామపురం ర్యాంపునకు అనుమతి లేకపోయినా రాత్రీ, పగలు భారీ వాహనాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. దానిపై ఎమ్మెల్సీ తోట ప్రశ్నకు సమాధానం చెబుతూ శ్రీరామపురం ర్యాంపునకు అనుమతి లేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. అనుమతి లేనప్పుడు బహిరంగంగా తవ్వకాలు జరుపుతుందంటే కూటమి ప్రభుత్వం అక్రమాలకు నిదర్శనమని సభ్యులు అన్నారు.

చెరువు గట్టును కాపాడండి

నిడసనమెట్ట చెరువుగట్టు ఆక్రమణకు గురవుతున్న విషయమై సర్వే చేసి గట్టును స్వాధీనం చేసుకోవడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ అబ్బు అన్నారు. గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యక్తి గట్టును ఆక్రమించుకుని కొబ్బరి చెట్ల పాట నిర్వహణను అడ్డుకుంటున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఉత్తమ సేవలతో మంచి గుర్తింపు



మండపేటలో సత్కారం అందుకున్న తహసీల్దార్, ఇతర ఉద్యోగులు



కలెక్టర్, జేసీ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్ఐ సత్యదేవ ప్రసాద్



రెవెన్యూ సిబ్బందిని సత్కరించిన తహసీల్దార్ మృత్యుంజయరావు



అమలాపురంలో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

కపిలేశ్వరపురం: రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు డీవీ శేఖర్, వల్లూరి రామచంద్రరావు, ఉత్తమ వీఆర్వోగా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న మాచర వీఆర్వో వై.రాజారత్నంను ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ జి.శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు మాట్లాడుతూ రెవెన్యూపరమైన సేవలను పారదర్శకంగా అందించడం ద్వారా ఉద్యోగులకు మంచి గుర్తింపు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 19 గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. తహసీల్దార్ పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు రెవెన్యూ పరమైన సాధారణ సేవలతో పాటు ప్రకృతి విపత్తులు సమయంలో అందిస్తున్న సేవలను సమాజం గుర్తిస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులచే ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పీఏ మెహర్‌బాబా రెవెన్యూ దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు వాడ్రేవు రామచంద్రరావు, నూరు శాతం నీటి తీరువా వసూళ్ల లక్ష్యాన్ని సాధించిన ఏడిద, పాలతోడు, అర్తమూరు వీఆర్వోలు జి.దుర్గారావు, ఇ. శ్రీనివాసు, కె..నరసింహమూర్తిను ఘనంగా సత్కరించారు. జిల్లాస్థాయిలో రెవెన్యూ, సర్వే విభాగాల్లోని ఉద్యోగులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండపేటకు ప్రథమ స్థానం దక్కడంతో తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, రీసర్వే డీటీ పి.కల్యాణి, మండల సర్వేయర్ సీహెచ్ సుజాత, తాపేశ్వరం, అర్తమూరు వీఆర్వోలు పి.విజయరాజు, కె.రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ పీఏ మెహర్ బాబా, ఆర్ఐ పి. వాసంతి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, గ్రామాల్లోని రెవెన్యూ సహాయకులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ పురస్కారాలు

రామచంద్రపురం రూరల్: రెవెన్యూ డేను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి నుంచి పలువురు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ అవార్డులకు రామచంద్రపురం మండలం నుంచి తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవ ప్రసాద్, రామచంద్రపురం పట్టణ వీఆర్ఓ మద్దాల బాపూజీ ఎంపికయ్యారు. ఆర్ఐ, వీఆర్ఓ అవార్డులు అందుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

ఇలాఉండగా రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమాన్ని తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని రెవెన్యూ సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. వీరిలో తహసీల్దార్ దఫేదార్ గుమ్మడి నాగేశ్వరరావు, వీఆర్ఓలు డి.నరేష్, ఎస్.సత్తిబాబు, జి.సురేష్, విలేజ్ సర్వేయర్లు ఎస్.ప్రతాప్, ఎస్‌వీ ప్రసాద్, మణిమాల, వీఆర్ఏలు గంగరాజు, రమేష్, వేణు, వెంకన్న ఉన్నారు. విశ్రాంత రెవెన్యూ సిబ్బంది బాలాంతరం గోపాలకృష్ణ, మేడవరపు రాంబాబు, మంత్రిప్రగఢ రాంబాబు, గుమ్మడి పాపారావును ఈ సందర్భంగా సత్కరించారు.

తహసీల్దార్ తేజేశ్వరరావుకు ఉత్తమ సేవా పురస్కారం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పి. కల్యాణికి ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని తేజేశ్వరరావు, కల్యాణి అందుకున్నారు. వారిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అభినందించారు.